క్లుప్తంగా

పక్షుల కేంద్రంలో కలెక్టర్ కుటుంబ సభ్యులు


విహంగాలను వీక్షిస్తున్న కలెక్టర్ కుటుంబ సభ్యులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రాన్ని శుక్రవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ సతీమణి, కుటుంబ సభ్యులు సందర్శించారు. కేంద్రంలో విడిది చేసే విహంగాలను తిలకించడంతో పాటు పర్యావరణ కేంద్రాన్ని సందర్శించారు.

ఆస్తిహక్కు పత్రాల పంపిణీ

దక్కిలి: మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ మండలంలోని వీకేపై సముద్రం గ్రామానికి చెందిన రైతులకు యాజమాన్య ఆస్తిహక్కు పత్రాలను అందజేశారు. ఎంపీపీ గోను రాజశేఖర్, డీఎల్‌పీఓ వెంకటరమణ, తహసీల్దార్ రమేష్ బాబు,ఎంపీడీఓ ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ


అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న నేతలు

కోట: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం కోటలో ఆయోధ్య రామమందిరం అక్షింతలను పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి వాసు మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను కోట, వాకాడు, చిట్టమూరు మండ లాల్లోని ప్రతి ఇంటికీ అందజేస్తున్నట్లు తెలిపా రు. కోటేశ్వర రావు, జనార్దన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

31న జాబ్‌మేళా

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 31వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు ఆధార్‌కార్డు, మార్కుల లిస్టు, టీసీ, రెండు ఫొటోలు, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్ కాపీలు తీసుకుని రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీకే ప్రసాద్‌ను 9440753860, హెచ్ఆర్ బీ మురళి 8886660979, 8886660975 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కోడి పందెం స్థావరంపై దాడి

కోట: మండలంలోని గోవిందపల్లె సమీపంలో కోడిపందెం స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. ఇద్దరు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని, రూ.2 వేలు నగదు, కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెళ్లకూరు: స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులు స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సెబ్ అధికారులు దాడులు చేసి, రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసి నాయుడుపేట సెబ్ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. అంతలో ఇసుక వ్యాపారులు అక్కడ కూలీలతో కలిసి ట్రాక్టర్లను తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. అయినా అధికారులు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు.

బెల్టు షాపుపై దాడులు

సైదాపురం: మద్యం బెల్ట్‌షాపుపై పోలీసులు దాడులు చేసి, 23 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, ఒకరిని అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని చాగణంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ వాసు కథనం మేరకు.. చాగణంలో జయరామయ్య అక్రమంగా మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేశారు. ఆ సమయంలో అతని వద్ద అనుమతి లేకుండా ఉన్న 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకుని కేసు ను నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం


నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

గూడూరురూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని చవటపాళెం గ్రామానికి చెందిన బాలకిషోర్ అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. ఆ సమయంలో అతని వద్ద 30 మద్యం బాటిళ్లు ఉండగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సేవ చేసే భాగ్యం కల్పించండి


రాపూరులో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: రానున్న ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, మీ సేవ చేసే భాగ్యం కల్పించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. రాపూరులో శుక్రవారం నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించి, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, అవ్వతాతలకు కళ్ల అద్దాలు, ఆడుదాం ఆంధ్ర, రామిరెడ్డిపల్లె రోడ్డు ప్రారంభం తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, ప్రతి ఇంటికి ధైర్యంగా వెళ్లి తాము చేసిన అభివృద్ధి చెప్పగలమన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో తీసుకురాగలిగిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని చెప్పారు.


మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

కల్లబొల్లి మాటలు చెప్పే పార్టీలకు ఓటు వేయవద్దని సూచించారు. నిజాయితీగా పనిచేసే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయితే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందించనున్నట్లు చెప్పారు. విద్య, వైద్యరంగాల్లో సమూల మార్పులు తీసుకువచ్చారని తెలిపారు.

ట్యాబ్‌లు పంపిణీ

రాపూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల్లో శుక్రవారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి అత్యున్నత విలువలతో కూడిన విద్య అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువే నన్న లక్ష్యంతో జగనన్న ఉన్నారని చెప్పారు.

వాలీబాల్ ఆడిన నేదురుమల్లి

రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని, కొంతసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, సర్పంచ్ జయమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎన్ రవీంద్రారెడ్డి, నాయకులు శశిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటసుబ్బయ్య, పిచ్చిరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోన దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ


రాపూరు: నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న నేతలు

రాపూరు: స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో శుక్రవారం పెంచలకోన దేవస్థానం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పెంచలకోన దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పెంచలకోన దేవస్థానంలో తాత్కాలిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ జనార్దన్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, వినోద్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్..

సైదాపురం(వెంకటగిరి): పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలండర్, డైరీని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరామ నాగేశ్వరరావు, బి సునీత, సీ సుబ్రమణ్యం, వేణు, చంద్రమౌళి, రామచంద్రయ్య, రమణయ్య, సుబ్బరాయులు, మూర్తి వెంకటశివ, రాకేష్ శ్యామ్, వెంకటేశ్వర్లు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న అనిల్‌కుమార్ రెడ్డి

కలువాయి: జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విందూరు విద్యార్థిని ప్రతిభ


జ్ఞాపిక అందుకుంటున్న పర్ణిక

గూడూరురూరల్: తిరుపతిలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పర్ణిక ప్రతిభ చూపి, తృతీయ స్థానంలో నిలిచింది. ఎస్వీయూ ప్రొఫెసర్ మురళి చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకుంది. శుక్రవారం పాఠశాలలో హెచ్ఎం వెంకట నాగమల్లికార్జునరావు విద్యార్థిని పర్ణిక, గైడ్ టీచర్ ప్రవీణ్‌గురును అభినందించారు.

నూతన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

గూడూరురూరల్: పట్టణ ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని సీఐ హజరత్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ రాత్రి 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే న్యూ ఇయర్ సంబరాలు చేసుకోవడానికి అనుమతి ఉందని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టమ్ వినియోగించేందుకు తప్పనిసరిగా పోలీసు అధికారుల ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు చోటు ఉండకూడదన్నారు. ముఖ్యంగా యువత అతిగా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

న్యూ ఇయర్ వేడుకలు


కేక్ కట్ చేసి, వేడుకలు చేసుకుంటున్న సిబ్బంది

కోట: ఐసీడీఎస్ కోట ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. సూపర్‌వైజర్లు, సిబ్బందితో కలసి సీడీపీఓ మునికుమారి కేక్‌కట్ చేశారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం సీడీపీఓను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మ, పద్మ, శేషమ్మ పాల్గొన్నారు.

గోదాదేవికి క్షేత్రోత్సవం


విశేషాలంకరణలో గోదాదేవి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శుక్రవారం గోదాదేవికి ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా పెంచలకోనలో గోదాదేవికి 4 శుక్రవారాలు ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం, నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మొదటి శుక్రవారం గోదాదేవి ఉత్సవమూర్తిని తిరుచ్చిపై కొలువుదీర్చి విశేషాలంకరణ చేసి, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు.

కోర్టు ఆదేశాల మేరకే ఆక్రమణల తొలగింపు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో రహదారి పక్కన షికారీలు(నక్కలోళ్లు) అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు నడుమ తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. టీ బాలకృష్ణారెడ్డికి


ఆక్రమణలను తొలగింపును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చెందిన స్థలం ఉందని, దాని ముందు షికారీలు దుకాణాలు ఏర్పాటు చేసి, తనకు దారిలేకుండా చేస్తున్నారని ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారన్నారు. ఆక్రమణలను తొలగించాలని సుప్రీంకోర్టు నుంచి ఉన్నతాధికారులకు ఉత్తర్వులు అందాయన్నారు. ఈ మేరకు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో సీఐలు నరసింహారావు, వైవీ సోమయ్య ఆధ్వర్యంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఆక్రమణలు తొలగించారన్నారు.

న్యాయం చేసేలా చర్యలు చేపట్టండి

సుమారు 40 ఏళ్ల నుంచి ఉన్న దుకాణాలను తొలగించారని, అయితే వారికి న్యాయం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. న్యాయస్థానం ప్రైవేటు వ్యక్తికి కేవలం దారి హక్కు కల్పించాలని మాత్రమే ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

రైతు మృతి

సైదాపురం: మండల కేంద్రంలోని ఏఓ కార్యాలయం వద్ద శుక్రవారం పరసారెడ్డిపల్లెకు చెందిన పీ రాఘవరెడ్డి (65) మృతి చెందారు. స్థానికులు కథనం మేరకు.. పరసారెడ్డిపల్లెకు చెందిన రాఘవరెడ్డి శుక్రవారం ఉదయం గ్రామం నుంచి ఎరువుల కోసం ఏఓ కార్యాలయం వద్దకు మరో రైతుతో కలిసి చేరుకున్నారు. ఆటోలో ఎరువులు వేస్తుండగా ఒక్కసారిగా రాఘవరెడ్డి రక్తం కక్కుకుంటూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. అక్కడ ఉన్నవారు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో పరసారెడ్డిపల్లె విషాదం నెలకొంది.

15లోపు నాట్లు వేసుకోవాలి

కలువాయి: ఆర్ఎన్ఆర్ 15048 తెలంగాణ రకం వరి సాగు చేసే రైతులు జనవరి 15వ తేదీ లోగా నాట్లు పూర్తి చేసుకోవాలని ఏఓ ప్రతాప్ తెలిపారు. బద్దెవోలు, కుల్లూరు, మాదన్నగారిపల్లె, ఉయ్యాలపల్లె సచివాలయాల పరిధిలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి నాట్లు ఆలస్యంగా వేస్తే తెల్లవెన్ను, గింజ విరుగుడు, మెడవిరుపు తదితర తెగుళ్లు ఆశిస్తాయన్నారు.

కండలేరులో 3.039టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 13.039 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైల్వే ప్రయాణికుల ఆందోళన

గూడూరురూరల్: కేరళ నుంచి విశాఖపట్నం వెళ్లే స్పెషల్ ట్రైన్‌లో కొన్ని బోగీల్లో ఏసీ పనిచేయకపోవడంతో శుక్రవారం సాయంత్రం గూడూరు రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులు ఆందోళనకు దిగారు. రైలులోని ఏసీలను రేణిగుంట వద్ద మరమ్మతులు చేసినప్పటికీ అవి మళ్లీ పనిచేయకపోవడంతో ప్రయాణికులు గూడూరులో రైలును నిలిపివేసి స్టేషన్ సూపరింటెండెంట్ వచ్చి ప్రయాణికులకు సర్ది చెప్పడంతో వారు శాంతించారు. దీంతో గూడూరు నుంచి ట్రైన్ విశాఖపట్నంకు బయలుదేరి వెళ్లింది.

మంత్రి కాకాణికి ఘన స్వాగతం


నాయుడుపేటలో మంత్రి కాకాణికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నాయుడుపేటటౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి నెల్లూరు నుంచి తడలో జరుగుతున్న కార్యక్రమాలకు వెళుతుండడంతో మార్గం మధ్యలో నాయుడుపేట వద్ద ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు శాలువలు కప్పి, ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. పార్టీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, టీ జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కే దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మి, పీ శేఖర్‌రెడ్డి, నాయకులు పీ హరినాథ్‌రెడ్డి, ఓ కిషోర్‌యాదవ్, కే రాజారెడ్డి, కే రామకృష్ణంరాజు, పీ చంద్రారెడ్డి, జె విజయబాబురెడ్డి, రత్నశ్రీ పాల్గొన్నారు.

ఉద్యోగులు దృఢ సంకల్పంతో పని చేయాలి


సమస్యలు వింటున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

దక్కిలి: ప్రభుత్వ ఉద్యోగులు దృఢ సంకల్పంతో పని చేసి ప్రజలలో విశ్వాసం పొందాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం జగనన్న కు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు వివిధ సమస్యలపై సచివాలయాలు, మండల కార్యాలయాలకు వస్తుంటారని, వారి సమస్యలను అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో బాధ్యతగా పని చేయాలన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి జగనన్న చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 37, వివిధ సమస్యలపై 13 ఆర్జీలు లబ్ధి దారులు అందజేశారు. వీటిని సంబంధిత శాఖ అధికారులకు ఆర్డీఓ అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఎంపీపీ రాజశేఖర్, మండల ఉపాధ్యక్షుడు జీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎల్‌డీఓలు వెంకటశేషయ్య, వెంకటరమణ, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, దక్కిలి సర్పంచ్ శనగా వేమక్క, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

వేరుశనగ ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి


కిట్ అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

చిల్లకూరు: వేరుశనగతో పలు రకాల ఉత్పత్తులను తయారు చేసి, విక్రయించి ఆర్థికాభివృద్ధి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ విజయలు తెలిపారు. మండలంలోని తమ్మినపట్నంలో శుక్రవారం కృష్ణపట్నం పోర్టు అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ పంట సాగులో మెళకువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ తీర ప్రాంతంలో ఎక్కువగా వేరుశనగ పంట ఒకటే సాగు చేస్తున్నారన్నారు. పంట మార్పిడి లేనందున వేరుశనగకు తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయని చెప్పారు. పంట మార్పిడి చేస్తే తెగుళ్లను తగ్గించవచ్చని తెలిపారు. అలాగే వేరుశనగ పంట నుంచి వచ్చే వ్యర్థాలను పవర్ ప్రాజెక్టులకు విక్రయించి సొమ్ము చేసుకోవచ్చన్నారు. ఎండిన వేరుశనగ పొట్టుతో పలు రకాలు ఉత్పత్తులను తయారు చేసి ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. అదానీ ఫౌండేషన్ అగ్రికల్చర్ కన్సల్టెంట్ డాక్టర్ సెల్వరాజ్, అగ్రికల్చర్ ఆఫీసర్ షేక్ షాహుల్ హమీద్, కో ఆర్డినేటర్లు మురళి, వనజ, లీలావతి, గోవిందమ్మ పాల్గొన్నారు.

అన్నీ అంశాలకు ఆమోదం


మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 16 అంశాలతో కూడిన అంజెండాను ప్రవేశపెట్టగా అన్ని పనులకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఇక ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కమిషనర్ వెంకటరామయ్య దృష్టికి తీసుకొచ్చారు.

డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిరూరల్: మండలంలోని మొగళ్లగుంటలో డ్రోన్‌తో పురుగుమందుల పిచికారి(డ్రోన్ స్ప్రేయింగ్) విధానంపై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రత్యేకాధికారి నాగార్జునసాగర్ శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రైతులు తక్కువ కాలంలో సులభంగా మందుల పిచికారి చేయించుకునేందుకు డ్రోన్ స్ప్రేయింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెళ్లకూరు: మండలంలోని పునబాక రైస్‌మిల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పైపూరి శంకరయ్య(50) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు..పునబాక రైస్‌మిల్లు సమీపంలో ఈ నెల16 వ తేదీన రోడ్డు పక్కన నడిచి వెళుతున్న శంకరయ్యను అదే మార్గంలో వెళుతున్న మోటారుబైక్ ఢీకొనడంతో ఆయన గాయపడ్డాడు. శంకరయ్యను తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడా ప్రతిభ గుర్తింపే ఆడుదాం..ఆంధ్ర లక్ష్యం


దక్కిలి: బాలాయపల్లెలో కబడ్డీ ఆడి, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న దేవికాచౌదరి


దొరవారిసత్రం: వాలీబాల్ జట్లతో అధికారులు, నాయకులు


ఓజిలి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేత బాబురెడ్డి

దక్కిలి (బాలాయపల్లె): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించడంతోపాటు వారిని ఆటల్లో ప్రోత్సహించడమే ఆడుదాం ..ఆంధ్ర లక్ష్యం అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి రావి దేవికాచౌదరి తెలిపారు. శుక్రవారం బాలాయపల్లె హైస్కూల్‌లో ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు సచివాలయ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి, మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావలన్నారు. క్రీడలతో చక్కటి ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. అలాగే జయంపు హైస్కూల్‌లో క్రీడా పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి పరిశీలించారు.

పోటాపోటీగా ఆడుదాం.. ఆంధ్ర

దొరవారిసత్రం: బీసీ గురుకుల పాఠశాల, ఉచ్చూరు, కల్లూరు, సూరపుఅగ్రహారం ప్రాంతాల్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు పోటాపోటీగా జరిగాయి. ఎంపీడీఓ రఘురామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఖాదర్‌మస్తాన్, రామయ్య, మునికృష్ణ, కుప్పస్వామి పాల్గొన్నారు.

ఉల్లాసంగా..

సైదాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నాలుగో రోజైన శుక్రవారం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు, వారిలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీ కోటేశ్వరరావు, కార్యదర్శి శశిఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

యువతకు గొప్ప అవకాశం

ఓజిలి: గ్రామాల్లో ఉత్తమ ప్రతిభకనబరిచే యువతీ, యువకులకు ఆడుదాం ఆంధ్ర గొప్ప అవకాశమని పార్టీ మండల మాజీ కన్వీనర్ జే బాబురెడ్డి అన్నారు. మండలంలోని ఇనుగుంట, అత్తివరం గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర పోటీలను ఎంపీడీఓ రజనీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిరాజ్‌బాషా, రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..

పెళ్లకూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో ఉల్లాసంగా సాగాయి. మండలంలోని అన్ని సచివాలయాల్లో క్రికెట్, కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ సురేష్‌బాబు క్రీడా పోటీల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా కారులంతా గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలన్నారు.

వంజివాకలో..

కోట: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు శుక్రవారం వంజివాకలో నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీఓ భవాని, పంచాయతీ కార్యదర్శి రియాజ్‌ల పర్యవేక్షణలో పోటీలను నిర్వహించారు.






పెళ్లకూరు: కబడ్డీ ఆడుతున్న యువకులు, ఓజిలి: క్రీడాపోటీల్లో పాల్గొన్న యువత, సైదాపురం: వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు